

మాట్లాడుతున్న ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

## 'శిరోముండనం'పై తూతూమంత్రంగా చర్యలా?

- పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

లింగాల, అక్టోబర్ 26: శిరోముండనం ఘటనలో ఎస్సైపై తూతూ మంత్రంగా చర్యలు తీసుకోవడమేంటని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ప్రశ్నించారు. ముగ్గురు యవకుల శిరోముండనం ఘటనలో లింగాల ఎస్సై జగన్ మోహన్‌ను సస్పెండ్ చేయడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రానికి చేరుకొని బాధిత యువకులు, చుట్టుపక్కల ప్రజలతో మాట్లాడి వివరాలను సేకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. యువకులు తప్పుచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలే తప్ప అవమాన పర్చేలా గుండు గీయించడం ఏ చట్టంలో లేదని చెప్పారు. ఇంతటి ఘోరానికి పాల్పడిన ఎస్సైని అటాచ్ చేయడం చూస్తుంటే రాజకీయ జోక్యం కూడా తోడైందనిపిస్తున్నదని ఆరోపించారు. ఎస్సైని పూర్తిగా విధుల నుంచి తొలగించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.



బాలాజీనగర్ కాలనీలో హెచ్ఐజీ 53లో ప్లాట్ నంబర్ 502లో జీహెచ్ఎంసీ కూల్చివేతల తర్వాత శిథిలాలు

# మా ఇల్లు గోవిందా!

మొదటిపేజీ తరువాయి...

పూర్తయ్యాక ఫ్లాట్స్ అన్నీ అద్దెకిచ్చారు. ఐదో అంతస్థులోని 502 ఫ్లాట్‌ను నారాయణ దంపతులకు కిరాయికి ఇవ్వగా.. 501తోపాటు మిగతా ఫ్లాట్స్‌ను కూడా కిరాయికి ఇచ్చారు.

### నోటీసులు ఇవ్వకుండానే ధ్వంసం..

502 ఫ్లాట్‌లో కిరాయికి ఉంటున్న నారాయణ దంపతులు వెంకటేశ్వర స్వామి దర్శనం కోసం తిరుపతికి వెళ్లారు. శనివారం ఉదయం మూసాపేట్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మల్లేశ్వర్, టీపీఎస్ ప్రభావతి పర్యవేక్షణలో డిమాల్యుయేషన్ స్క్వాడ్ సిబ్బంది రంగంలోకి దిగి.. హైకోర్టు ఆదేశాలు ఉన్నాయంటూ 502 ఫ్లాట్‌ను కూల్చివేశారు. దీంతో ఇంట్లోని ఏసీ, ఫ్రిడ్జ్, సోఫాతోపాటు ఇతర సామగ్రి అంతా ధ్వంసమైంది. 15 మంది సిబ్బంది క్షణాల్లో ఫ్లాట్‌ను కూల్చివేయడంతో గమనించిన స్థానికులు అధికారుల తీరుపై మండిపడ్డారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే ఇంటిని కూల్చివేసిన అధికారులను ప్రశ్నించారు. నగరంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడే అక్రమ నిర్మాణాలు జరిగాయా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారులు ఇష్టారాజ్యంగా, వీధి రౌడీల్లా ఇండ్లను కూల్చివేస్తున్నారని, ఇదేం ప్రజాపాలన? అని మండిపడ్డారు. ఒకవేళ అక్రమ నిర్మాణమైతే ముందుగా నోటీసులిస్తే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తంచేశారు. దీంతో అక్కడి నుంచి అధికారులు, సిబ్బంది జారుకున్నారు. ఇంటి కూల్చివేత అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయిన జీహెచ్ఎంసీ, టౌన్‌ప్లానింగ్ అధికారుల ఫోన్లు స్విచ్ఛాఫ్ వచ్చాయి. ఈ విషయమై కూకట్‌పల్లి జోన్ నోడల్ ఆఫీసర్, మూసాపేట సర్కిల్ ఉప కమిషనర్ రమేశ్‌కు ఫోన్ చేస్తే స్పందించలేదు.



# రాష్ట్రంలో ఆగిన 59 రోడ్డు ప్రాజెక్టులు

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో 59 రోడ్డు ప్రాజెక్టులు నిలిచిపోయినట్టు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ కార్యాలయం వెల్లడించింది. ఇందులో 7 ప్రాజెక్టులు ఐదేండ్లుగా పెండింగ్ ఉంటే, ఒక ప్రాజెక్టు నాలుగేండ్లు, 20 ప్రాజెక్టులు 3 ఏండ్లు, 31 ప్రాజెక్టులు ఏడాదిగా పెండింగ్ ఉన్నట్టు తెలిపారు. అటవీ శాఖ అనుమతులు లేకపోవడంతో నిలిచిపోయిన రోడ్డు ప్రాజెక్టులపై శనివారం సచివాలయంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ సమీక్షించారు. అనుమతులు సాధించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్న అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అటవీ అనుమతుల కోసం ఉమ్మడి జిల్లాల వారీగా పర్యవేక్షణాధికారులను నియమించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ డోబ్రియల్‌ను ఆదేశించారు.




## ఇంటివద్దకే ఆర్టీసీ కార్గో సేవలు: మంత్రి పొన్నం

హైదరాబాద్, అక్టోబర్ 26(నమస్తే తెలంగాణ): ఆదాయం పెంపే లక్ష్యంగా ఇంటివద్దకే టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్(కార్గో)సేవలను ప్రారంభిస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి హైదరాబాద్‌లోని 31 ప్రాంతాల్లో హోం డెలివరీ సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని వెల్లడించారు.

## మీ హిందీ లేఖ ఒక్క ముక్కా అర్థం కాలేదు

- కేంద్ర మంత్రిపై డీఎంకే ఎంపీ ఆగ్రహం

న్యూఢిల్లీ, అక్టోబర్ 26: ఇంగ్లిష్‌లో సమాధానం ఇవ్వాలని కోరినా హిందీలో లేఖలు పంపుతున్నారంటూ డీఎంకే ఎంపీ అబ్దుల్లా రైల్వే సహాయ మంత్రి రవ్నీత్ సింగ్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. తాను అడిగిన సమాచారం ఇంగ్లిష్‌లో పంపాలని కోరుతూ రవ్నీత్ సింగ్‌కు తమిళంలో లేఖను పంపారు. హిందీ, తమిళం రెండు భాషల్లో ఉన్న లేఖలను ఎంపీ అబ్దుల్లా సోషల్ మీడియా 'ఎక్స్'లో విడుదల చేశారు. 'మీరు పంపిన హిందీ లేఖలో ఒక్క ముక్కా నాకు అర్థం కాలేదు. రైల్వే సహాయ మంత్రి కార్యాలయం పంపే లేఖలన్నీ హిందీలో ఉంటున్నాయి. హిందీ అర్థం చేసుకోలేను, ఇంగ్లిష్‌లో పంపండని చెప్పినా వినటం లేదు. రైల్వే మంత్రికి అర్థం అయ్యే విధంగా..తమిళంలో సమాధానం పంపా' అని ఎంపీ తెలిపారు.

# పోస్టాఫీసులో 30 లక్షల డిపాజిట్లు గల్లంతు

- పెద్దపల్లి జిల్లా బేగంపేట సబ్ పోస్ట్‌మాస్టర్ చేతివాటం!
- విచారణ ప్రారంభించిన ఉన్నతాధికారులు

రామగిరి, అక్టోబర్ 26: పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట పోస్టాఫీసులో డిపాజిట్లు గల్లంతైన ఘటన వెలుగు చూసింది. ఖాతా బుక్‌లు నకిలీవని తెలియడంతో ఉన్నతాధికారులకు సమాచారం తెలిపి సబ్ పోస్టాఫీస్‌కు వెళ్లారు. సబ్ డివిజన్ పోస్టల్ అధికారి ఏ మోహన్ ఆధ్వర్యంలో అధికారులు బేగంపేట పోస్టల్ కార్యాలయానికి చేరుకొని రికార్డులు పరిశీలించారు. 200 మంది డబ్బులు డిపాజిట్ చేయగా, వారికి సదరు పోస్ట్ మాస్టర్ తన సంతకాలతో కూడిన నకిలీ పాసుపుస్తకాలు అందించి రూ.30 లక్షలు కాజేసినట్టు తేలింది. సెంటినరీకాలనీ మెయిన్ పోస్టాఫీస్‌లో గతంలో పని చేసిన నరేంద్రచారి అనే పోస్ట్ మాస్టర్ కారకుడనీ, నెల రోజుల సమయం ఇస్తే ఎవరి డబ్బు వారికి చెల్లిస్తానని ఆరోపణలు ఎదుర్కొంటున్న సబ్ పోస్ట్‌మాస్టర్ చెప్పడం గమనార్హం. బేగంపేట పోస్టాపీస్‌లో పొదుపు పథకంలో జమ చేసిన ఖాతాదారులకు సంబంధించిన డిపాజట్లకు ఆన్‌లైన్ చేయడంతో డిపాజిట్ చేసిన వ్యక్తి ఫోన్‌కు సందేశం వస్తుందని విచారణ అధికారి మోహన్ తెలిపారు. పొదుపు చేసుకునే వారికి పాసుపుస్తకం అందించి జమ చేసే డబ్బులను పొందుపర్చడం జరుగుతుందని చెప్పారు. ఇక్కడ పని చేస్తున్న ఓ పోస్ట్ మాస్టర్ నకిలీ పుస్తకాలు అందించి, ఒరిజినల్ ఖాతాదారుల ఖాతా నంబర్ వేసి పొదుపు సొమ్ము కాజేసినట్టు తేలిందని వివరించారు.



పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట పోస్టాఫీసులో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

